క్లుప్తంగా

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన మల్లయ్యకు మంగళవారం రూ. 3 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాన్ని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందించారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసిన బాధిత కుటుంబసభ్యులకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ. 3 లక్షల విలువైన ఎల్‌వోసీ అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా పెద్దపల్లి అభివృద్ధి


పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి అన్నారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 24,29,31 వార్డుల్లో చేపట్టిన సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. పట్టణంలో స్వచ్ఛతా పరిశుభ్రత పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు పైడ పద్మ, కృష్ణమూర్తి, మల్లయ్య, పోతని పురుషోత్తం, షాహిద, నూర్జహాన్, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, మనోహర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి అన్నారు. సయ్యద్ ఖాలీద్ ప్రగతినగర్ కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించి, నిర్వాహకులను అభినందించారు. కౌన్సిలర్ ఉప్పు స్వరూప, నాయకులు ఉప్పు రాజు, ఫహీం, ఓదెలు,పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులు నిలిపేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని కోరుతూ కమాన్‌పూర్ గ్రామస్తులు మంగళవారం జిల్లా కలెక్టర్ సంగీతకు వినతి పత్రం అందజేశారు. భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం కమాన్‌పూర్ గ్రామ పరిధిలో ఉందని కమాన్‌పూర్, కొత్తగా ఏర్పాడిన సిద్దిపల్లె గ్రామాలకు సరిహద్దులు నిర్ణయించేంతవరకు ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని కోరారు.

వరిలో మెడవిరుపు నివారణ చేపట్టాలి


పొలాలను పరిశీలిస్తున్న ఏవో ప్రత్యూష

జూలపల్లి: వరి పొలాలు పొట్ట దశలో ఉన్నందునా మెడవిరుపు వైరస్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో ప్రత్యూష సూచించారు. మంగళవారం తేలుకుంట,చీమల పేట గ్రామాల్లో పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మెడ విరుపు తెగులు వచ్చినప్పుడు ఆకులపై ఎర్రని మచ్చలు ఏర్పడి, వాటి నుంచి కుదుళ్లకు సోకి పంటను నష్ట పరుస్తుందని వివరించారు. తెగులు సోకినట్లు గుర్తించిన వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, ఇందుకు ట్రై సైక్లోజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో కిరణ్మయి, రైతులు ఉన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ నాగరాజమ్మ తనిఖీ చేశారు. ఈసంధర్భంగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును, సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ అనిత, డిపార్ట్‌మెంట్ అధికారి భూపతి, క్లర్క్ బొల్లం ప్రవీణ్, ఇన్విజిలేటర్లు ఉన్నారు.

36 ఏళ్లుగా పక్కా భవనానికి నోచుకోలే!

- శిథిలావస్థలో ఓదెల ఆయుర్వేద వైద్యశాల
- స్థలం ఉన్నా.. మంజూరు కాని నిధులు
- కనీస సౌకర్యాలు లేక మహిళా సిబ్బంది ఇబ్బందులు
- భయం భయంగా విధులు


పెచ్చులూడుతున్న భవనం


శిథిలావస్థలో ఓదెల ఆయుర్వేద వైద్యశాల

ఓదెల: మండలకేంద్రం ఓదెలలో ముప్పయి ఆరేళ్ల క్రితం ప్రారంభమైన ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకుంది. భవనం పురాతనమైంది కావడంతో పెచ్చులూడిపడుతున్నాయి. దీంతో సిబ్బంది భయంగా విధులు నిర్వహిస్తున్నారు. రోగులు నరకం అనుభవిస్తున్నారు. పక్కాభవనానికి సరిపడా స్థలం ఉన్నప్పటికీ నిధులు మంజూరు కాకపోవటంతో ఆయుర్వేద వైద్యశాల కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆస్పత్రికి పక్కాభవనం ప్రహరీ నిర్మించకపోవటంతో స్థలం అన్యాకాంతం అవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇరుకు గదులల్లోనే సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే విధులను నిర్వహిస్తున్నారు. మంచినీటి వసతి లేకపోవటంతో బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కేవలం రెండు కుర్చీలు, బల్ల ఉండటంతో పడరాని ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో ఫర్నీచర్, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.మండలంలో ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లో ఆయుర్వేద ఆస్పత్రులు ఉన్నాయి. ఓదెల పరిధిలో హరిపురం, మడక, కనగర్తి, కొలనూర్, కొమిర, నాంసానిపల్లె, గోపరపల్లె, ఉప్పరపల్లె గ్రామాలకు చెందిన వారు ఆస్పత్రి సేవలు పొందుతారు. ముఖ్యంగా మోకాళ్ల నొప్పులు, అన్నీ రకాల ఎలర్జీ, అస్తమాకు, పచ్చ కామెర్లు, మూత్ర సంబంధ వ్యాధులు, స్త్రీలకు వచ్చే వ్యాధులకు ఆయుర్వేద వైద్యం మందులు వాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పక్కాభవనాలకు నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు.

ఆస్పత్రికి వస్తే తలమీద రాయిపడ్డది



నాకు కాలునొప్పి తగ్గటం కోసం మందుల కోసం ఆస్పత్రికి వస్తే తలమీద రాయిపడింది. ఆయుర్వేద వైద్యం మందులపైన ఇప్పటికీ నమ్మకం ఉంది. ఇప్పటికి భయపడుకుంటూనే దవాఖానాకు వెళ్తున్నాను. దవాఖానాకు రిపేరు లేదు, పక్కాభవనం లేదు . రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

– తోటపల్లి శివయ్య, కొమిర

పక్కాభవనానికి నిధులు మంజురు చేయాలి



ఓదెల ఆయుర్వేద వైద్యశాల పక్కాభవనానికి నిధులు మంజూరు చేయాలి. చాలా ఏళ్లుగా శిథిలావస్థలోకి చేరుకున్న గదులలోనే సిబ్బంది పనిచేస్తున్నారు. రోగులు, గ్రామస్తులు, సిబ్బంది పక్కాభవనానికి కోసం ఎదురుచూస్తున్నారు.అధికారులు పట్టించుకుని భవనానికి నిధులు మంజూరు చేయించాలి.

-తీర్థాల వీరన్న, ఓదెల

వైద్యం కోసం వస్తున్నారు



వైద్యశాలకు వైద్యంకోసం నిత్యం రోగులు వస్తున్నారు. దీర్ఘకాలికంగా ఇబ్బందులు ఉన్న మోకాళ్లనొప్పులు, ఎలర్జీ, ఆస్తమా, పచ్చ కామెర్లు, మూత్రసంబంధ జబ్బులున్న వారికి వైద్యసేవలను అందిస్తున్నాం. మందులను పంపిణీ చేస్తున్నాం. ఆయుర్వేద వైద్యం కోసం ఓదెల చుట్టుపక్కల గ్రామాలవారు నిత్యం వస్తున్నారు. ఓపీ పెరుగుతోంది.

– కమలాకుమార్, మెడికల్ ఆఫీసర్, ఓదెల

పేపర్ల లీక్‌పై యూత్ కాంగ్రెస్ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖనిటౌన్: టీఎస్‌పీఎస్సీ,పదో తరగతి ప్రశ్న పత్రాల లీకేజీలకు,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ మంగళవారం ప్రధాన చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ ఎంచర్ల మహేశ్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాల లీకేజీలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తూ సీఎం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీల వ్యవహారంలో సిట్‌తో విచారణపై నమ్మకం లేదని సీబీఐ, సిట్టింగ్ జడ్జిలతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాజీమొద్దీన్, కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని,కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి పెద్దెల్లి ప్రకాశ్, కొటం సతీష్,పీక అరుణ్, కీర్తి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని: రామగుండంకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయడాన్ని హర్షిస్తూ పలవురు నాయకులు మంగళవారం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మెడికల్ కాలేజీ, కోర్టు సముదాయ భవనాలు, ఐటీ టవర్ ఏర్పాటు బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు కలవల సంజీవ్, అచ్చే వేణు, కోటేశ్వరరావు, కొమురయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండంలో మెడికల్ కాలేజీతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే చందర్‌ల చిత్ర పటాలకు నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కంది తిరుపతి, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈసాల తక్కళ్లపల్లిలో..

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని ఈసాలతక్కళ్ళపల్లిలో బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎర్రంస్వామి, మండల అధికార ప్రతినిధి ముల్కల కొంరయ్య, బండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి,యువజన నాయకుల అరెస్టు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: పదో తరగతి బోర్డు ఎదుట నిరసన దిగిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం సరికాదని మంథని యువజన కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు, రాష్ట్రంలో పశ్నాపత్రాల లీక్‌తో ఎంతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ పనిచేస్తుందా అని వారు ప్రశ్నించారు. పేపర్ల లీక్‌లను ప్రశ్నిస్తే ప్రభుత్వం వేధిస్తోందన్నారు. లీకుల బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు గోటికార్ కిషన్, మంథని సత్యం, బండారి ప్రసాద్, పెరుగు రాకేశ్ తదితరులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుడి హౌస్ అరెస్టు

మండలంలోని సూరయ్యపల్లి క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసే ఏకలవ్యుడి విగ్రహాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో మంగళవారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలి


పేషెంట్లతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ: ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలదించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని వార్డులన్నీ పరిశీలించి, ఇన్‌పేషెంట్లు, వారి బంధువులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తనకు ఫోన్ చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలందించి, మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందిని కోరారు.

నిరాశ్రయులకు నిలయం తబితా ఆశ్రమం

రామగుండం: ఎందరో నిరాశ్రయులకు తబితా ఆశ్రమం ఆశ్రయం కల్పిస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తబితా ఆశ్రమంలో తబితా ద్వితీయ వర్ధంతి వేడుకలకు హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. తబితా భౌతికంగా దూరమైనా ఆశ్రమంలో ఉన్నవారందరిలో తబితను చూసుకోవాలని సూచించారు. అనంతరం తబితా తల్లిదండ్రులు వీరేందర్‌నాయక్–విమలమ్మను ఓదార్చారు. రాబోయే రోజుల్లో ఆశ్రమానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో పాలకవర్గానికి సన్మానం


పాలకవర్గాన్ని సన్మానిస్తున్న సందీప్‌రావు

సుల్తానాబాద్‌రూరల్: జాతీయ స్థాయిలో పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు అందుకున్న సందర్భంగా గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు జూపల్లి సందీప్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచ్ వీరగోని సుజాత, ఎంపీటీసీ పులి అనూష, కార్యదర్శి ప్రశాంత్ పాలకవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధు, సంఘ సీఈవో నబియొద్దీన్,పాలకవర్గం, కోఆప్షన్ సభ్యులున్నారు.

మహనీయుల ఆశయాల స్ఫూర్తితో భీం దీక్ష


భీం దీక్ష స్వీకరించిన జెడ్పీటీసీ నారాయణ

రామగుండం: ఏప్రిల్ నెలలో వచ్చే మహనీయుల జయంతి వేడుకలను పురస్కరించుకుని వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుంటూ అడుగుజాడల్లో నడిచేందుకు భీం దీక్ష స్వీకరిస్తున్నట్లు అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి భీం దీక్ష చేపట్టి మాట్లాడారు. భీం దీక్షతో బడుగు, బలహీనవర్గాల యువతలో పెనుమార్పులు వస్తాయని కోరారు. అనంతరం సర్దార్‌పాపన్న తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్యగౌడ్ జెడ్పీటీసీని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఫీర్ పహాడ్ దర్గా వద్ద నీటి వసతి కల్పించాలి

రామగిరి: మండలంలోని బేగంపేట ఫీర్ పహాడ్ దర్గా వద్ద భక్తుల సౌకర్యం కోసం తాగునీటి వసతి కల్పించాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్కకు దర్గా పూజారులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నెల రోజుల్లో మదర్సా ఏర్పాటు జరుగుతున్న నేపథ్యంలో బోరువేసి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీని కోరారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు మీర్జా ముజాహిద్ బేగ్, మోల్సాప్ ఇస్మాయిల్, చాంద్‌పాషా, మీర్జా చానావాస్ బేగ్ ఉన్నారు.

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో గోల్డ్‌మెడల్

పెద్దపల్లిరూరల్: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్, నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పోటీల్లో పెద్దపల్లి కాకతీయ టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పతకాలను సాధించారు. విద్యార్థులు నయనిక, హన్సిత్‌రెడ్డి, ప్రీతి, హవిష్‌బై, హర్షిత్, వర్షకృతి, షారోన్, సుజాత బంగారు పతకాలు సాధించగా మంగళవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీధర్, ఇన్‌చార్జి స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ టూర్‌కు ఐటీఐ విద్యార్థులు

పాలకుర్తి: గోదావరిఖనిలోని సారథి ఐటీఐ కళాశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంకు స్టడీ టూర్‌కు వచ్చారు. కంపెనీలోని అన్ని విభాగాలు తిరిగిన విద్యార్థులకు సిమెంట్ తయారీ విధానం గూర్చి స్థానిక అధికారులు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ఐఆర్ అధికారి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ఇంజపూరి నవీన్‌కుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

గోదావరిఖనిటౌన్(రామగుండం): పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి రేణికుంట్ల ప్రీతం మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా తాండూరులో 10వ తరగతి పరీక్ష ప్రారంభమైన 7 నిమిషాల్లోనే ప్రశ్నపత్రం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడం సిగ్గుచేటన్నారు. ఇటీవల టీఎస్‌పీఎస్‌సీ పేపర్ల లీక్ మరువకముందే మళ్లీ పదో తరగతి పేపర్ లీకవ్వడం వరుస ఘటనలతో పరీక్షల మీద నమ్మకం పోతుందన్నారు. 10వ తరగతి పేపర్ లీకేజీకి కారణమైన వారిపై సమగ్ర విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు న్యాతరి పవన్, సాగర్, రంజిత్, వెంకటేష్, సుభాష్, ప్రతాప్, ప్రదీప్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ పట్టణ అధ్యక్షుడిగా నవాబ్

రామగుండం: మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రామగుండం పట్టణ అధ్యక్షుడిగా ఎండీ.నవాబ్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్ మాదిగ నియామక ఉత్తర్వులు అందజేశారు. తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్షుడిగా నియమించిన రాజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

పెద్దపల్లిరూరల్: రామలక్ష్మణ్ జానకీ..జైబోలో హనుమాన్‌కీ..అంటూ మంగళవారం బందంపల్లిలో హనుమాన్ మాల ధారులు అంజన్న శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. అలాగే పెద్దపల్లి మండలం హనుమంతునిపేట నుంచి సర్పంచ్ తీగల సదయ్య తదితర భక్తులు కాలినడకన కొండగట్టుకు బయల్దేరారు.

గౌరెడ్డిపేటలో అక్రమంగా మట్టి తరలింపు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మట్టి అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. మంగళవారం గౌరెడ్డిపేటలో గుట్ట ప్రాంతం నుంచి జేసీబీతో తవ్వి టిప్పర్లలో అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు, యువకులు అడ్డుకున్నారు. ఆర్ఐ అంజయ్యకు సమాచారమందించారు. గ్రామస్తులే టిప్పర్, జేసీబీని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అయితే టిప్పర్‌కు రూ.5వేల జరిమానా విధించిన అధికారులు, జేసీబీ యంత్రం కనిపించడం లేదని చెప్పడం కొసమెరుపు. మండలంలోని కుర్మపల్లి, తుర్కలమద్దికుంట, బొంపల్లి తదితర ప్రాంతాల్లో మట్టి అక్రమదందా సాగుతున్నా సంబంధిత మైనింగ్ అధికారులతో పాటు అక్రమదందాను రెవెన్యూ, పోలీసు అధికారులు నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు


స్వామివారిని ఊరేగింపులో గ్రామస్తులు

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల–వేగురుపల్లి గ్రామాల మధ్యలో వెలిసిన మానేటి రంగనాయక స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారిని శేష వాహనంపై ఊరేగించారు. ఉదయం స్థాపిత దేవతారాధన, నిత్యాహవనం బలిహరణం, రాత్రి కూడా నిత్యావనం బలిహరణం నిర్వహించా రు. అనంతరం శ్రీ భూనీలా సహిత మానేటి రంగనాయకస్వామి వారు ఆలయ మాడవీధుల్లో శేష వాహనంపై ఊరేగారు. కార్యక్రమాల్లో ఆలయ ఆస్థాన పురోహితులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, గోవర్ధనగిరి రాజ్ కుమార్ ఆచార్యులు, సర్పంచులు విజేందర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

ఓదెల: నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని జిల్లా పరిషత్ సీఈవో ఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఓదెల మండలం పొత్కపల్లి, కొలనూర్, ఓదెల గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి మాట్లాడారు. నర్సరీల్లో మొక్కలను వర్షాకాలంలో నాటాలన్నారు. దీనికి ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలు కావాల్సిన రైతులు మండల పరిషత్ కార్యాలయంలో లేదా ఈజీఎస్ సిబ్బంది వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి సత్తయ్య, ఎంపీవో వాజీద్, సర్పంచులు ఆళ్ల రాజిరెడ్డి, సామ మణెమ్మ, ఆకుల ఉదయదేవి, ఉపసర్పంచులు తీర్థాల కుమార్, వంగ శ్రీనివాస్, పాకాల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో సీఈవో పూజలు

ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో జిల్లాపరిషత్ సీఈవో ఎం శ్రీనివాస్ మంగళవారం పూజలు చేశారు.ఆలయంలో మల్లికార్జునస్వామి, సీతరామచంద్రస్వామిలను దర్శనం చేసుకున్నారు. దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికి మల్లికార్జునస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

సంక్షిప్త వార్తలు

ఆడబిడ్డల భూ పోరాటానికి ప్రజాపంథా మద్దతు

జ్యోతినగర్: నిరుపేద ఆడబిడ్డల భూ పోరాటానికి సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల నరేశ్, గుమ్మడి వెంకన్న, చంద్రయ్య అన్నారు. మంగళవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఇళ్లు లేని పేదలకు కేటాయించాలని చేస్తున్న భూ పోరాట శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఏసీ గదుల్లో ఉంటున్నారని ఆరోపించారు, పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు భూపోరాటానికి సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా పేదల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్తులకు డీఎల్పీవో అభినందన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని లక్ష్మీపురం గ్రామాన్ని మంగళవారం డీఎల్పీవో వేణుగోపాల్ సందర్శించారు. గ్రామంలో నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండి పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో సీసీ రోడ్లు, పారిశుధ్య పనులు, మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతలను, పెరటి తోటలను, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. లక్ష్మీపురం గ్రామానికి జిల్లా స్థాయి అవార్డు రావడంపై గ్రామస్తులను అభినందించారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలుచేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. సర్పంచ్‌రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి

సుల్తానాబాద్: అర్హులు కంటి వెలుగు పరీక్షలను వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ కోరారు. మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని పూసాలలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ శ్రీజ, హెచ్‌ఈఓ శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం కంటివెలుగు వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సర్పంచ్ లలితారెడ్డి, ఉపసర్పంచ్ రవినాయక్, వైద్యాధికారి అనుదీప్, పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శశికళ అన్నారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలో మంగళవారం కంటివెలుగు ఎంపీడీవో ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు, పాల్గొన్నారు.

జూలపల్లి: అర్హులైన అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో వేణుగోపాలరావు సూచించారు. మండలంలోని అబ్బాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు సంపత్‌రెడ్డి, రత్నాకర్,సీహెచ్‌వో కలీమొద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.